క్లుప్తంగా

ఫెయిలైన విద్యార్థులకు శిక్షణ తరగతులు

శిరివెళ్ల: ఇంటర్మీడియెట్ ఫెయిలైన ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు నేటి నుంచి పరీక్షల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ తరగతులుంటాయని చెప్పారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక నందమూరి నగర్‌లోని స్టార్‌సొసైటీ ఆవస్య విద్యాలయంలో నిరాశ్రయ విద్యార్థులకు నందనం క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్ల పంపిణీ చేశారు. క్లబ్ నిర్వాహకులు రంజిత్ కుమార్, శ్రీధర్ బాబు, పాఠశాల వార్డెన్ నాగలక్ష్మి 70 మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. సభ్యులు నరసింహారావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణయ్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం వాల్మీకి సంఘం నియోజకవర్గ కన్వీనర్లు, మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. నాయకులు లాలుస్వామి, నారాయణ, మదనగోపాల్, నాగేశ్వరరావు, గజ్జెలన్న, రాముడు, అచ్చెన్న పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి

రుద్రవరం: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కార్మిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలు, ప్రదర్శనలు నిర్వహించారు. పలువురు వక్తలు కార్మిక చట్టాలు, వాటి పరిస్థితిపై వివరించారు. సీఐటీయూ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగరాజు రాజశేఖర్ పాల్గొన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో వివిధ విభాగాలకు సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాదికి గాను దేవస్థానంలో పడితరము స్టోరుకు, పూజా సరుకుల సరఫరాకు, ఆహ్వాన పత్రికలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు, రశీదు పుస్తకాల ముద్రణకు ఈ నెల 15వ తేదీ లోపు దేవస్థానం కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సంగమేశ్వరంలో భక్తుల పూజలు



వేపదారు లింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని ఆదివారం అధిక సంఖ్యంలో భక్తులు సందర్శించి పూజలు చేసుకున్నారు. వేపదారు శివలింగానికి రుద్రాభిషేకం, నదీజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా సప్తనదుల సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరించి, ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

జాగ'రణాల'కు చెక్

- నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- పట్టణంలో ప్రతి ఇంటికీ మంచి నీరు
- రూ.1.05 కోట్లతో డెడికేటెడ్ పవర్ లైన్, పంప్‌హౌస్ ఏర్పాటు
- పట్టణానికి 35 ఎంఎల్‌డీ నీటిని అందించేందుకు సన్నాహాలు



నీటిని నిల్వ చేసేందుకు నూతనంగా నిర్మించిన పంప్‌హౌస్,



పంప్ హౌస్‌లోకి వెళ్తున్న కేసీ నీళ్లు



పంప్ హౌస్‌కు వెళ్లే కేసీ కెనాల్ నీళ్లు



నూతనంగా అమర్చిన మోటార్లు

నంద్యాల(సిటీ): వేసవి వచ్చిందంటే పట్టణంలోని పలు కాలనీల్లో నీటి కోసం జాగరణ చేయడం, కుళాయిల వద్ద నీటి కోసం తోపులాటలు, ఘర్షణలు నిత్య కృత్యమే. నీటి సరఫరా వ్యవస్థ గందరగోళంగా మారడంతో ఎప్పుడు నీటిని విడుదల చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో నీటి కోసం మహిళలు తెల్లవార్లు మేల్కొని పట్టుకోవాల్సి వచ్చేది. అలాగే రెండు,మూడు రోజులకోసారి నీటిని విడుదల చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నీటి కోసం ఘర్షణలు సర్వసాధారణంగా మారాయి. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్పందించి మున్సిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎంత ఖర్చు అయినా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. దీంతో పట్టణానికి అవసరమైన నీటి కోసం కేసీ కెనాల్ నుంచి నీటిని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు.

ఎగువ ప్రాంత కాలనీల్లో సమస్య తీవ్రం..

జిల్లా కేంద్రమైన నంద్యాలలో సుమారుగా 2.50 లక్షల మంది జనాభా ఉంది. నంద్యాలలో 42 వార్డుల్లో ప్రధానంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే ప్రాంతాలు దేవనగర్, టీచర్స్ కాలనీ, సాయిబాబనగర్, వీసీ కాలనీలు. ఆయా కాలనీల్లో ఎప్పుడు నీళ్లు వస్తాయో తెలియని పరిస్థితి. ఎక్కువగా రాత్రుల్లోనే వచ్చేవి, తెల్లవారుజామున రెండు నుంచి నాలుగు గంటల మధ్య ఎగువ ప్రాంతాలకు నీళ్లు వచ్చేవి. కొంతసేపటికే సరఫరా నిలిచిపోయేది. దీంతో నీటికోసం కుళాయిల వద్ద నిత్యం ఘర్షణలు చోటుచేసుకునేవి.

డెడికేటెడ్ ఫీడర్ లైన్‌తో కరెంట్ కోతలు ఉండవు..

కేసీ కెనాల్ నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి పంప్ చేసి అక్కడి నుంచి వార్డులకు నీటిని సరఫరా చేయాలనే అధికారుల ప్రణాళిక విజయవంతంగా పూర్తి చేశారు. ఈ విధానం వల్ల పట్టణ ప్రజలకు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది. అయితే నీటిని పంపింగ్ చేసేందుకు సాధారణ కనెక్షన్ ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఒక్కో వార్డులోకి నీరు అందించే సమయం దాదాపుగా 3 నుంచి 6 రోజులు వెనక్కి వెళ్తుంది. ఈ కారణంగా ఆయా ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. విద్యుత్ ఇబ్బందులు ఉండకుండా పీఎస్పీడీసీఎల్ వారి సహకారంతో రూ.65 లక్షలు వెచ్చించి డెడికేటెడ్ ఫీడర్ పవర్ లైన్ తీసుకున్నారు. ఈ కనెక్షన్ ద్వారా నీటిని పంపింగ్ చేసేందుకు సబ్‌స్టేషన్ నుంచి పంప్ హౌస్‌కు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. ఈ లైన్ నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయడానికి, పవర్ కట్, లైన్ మెయింటెనెన్స్ ఉన్నప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పూర్తి స్థాయిలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే తప్ప పంప్‌హౌస్‌కు విద్యుత్ కోత ఉండదు. కేసీ కెనాల్ నీటిని లిఫ్ట్ చేసి పంప్‌హౌస్‌లలోకి, పంప్‌హౌస్ నుంచి మోటార్ల ద్వారా నీటిని కుళాయిలకు సరఫరా చేయడానికి చేర్పడానికి మార్గం సులువు చేశారు.

రూ.45 లక్షలతో పంప్‌హౌస్..

పట్టణానికి నీటిని పంపిణీ చేయడానికి, సరిపడా నీటిని స్టోర్ చేయడానికి రూ.45 లక్షలతో 15 ఎంఎల్‌డీ పరిమాణం కలిగిన పంప్‌హౌస్‌ను చిన్న చెరువు వద్ద నిర్మించారు. పట్టణ జనాభా దృష్ట్యా తాగు నీటి అవసరాల నిమిత్తం 34 ఎంఎల్‌డీ నీరు అవసరమవుతుంది. అయితే గతంలో 25 ఎంఎల్‌డీ సామర్థ్యం గల పంప్‌హౌస్ ఉండడంతో పట్టణానికి సరిపడ నీటిని సరఫరా చేయలేకపోయారు. దీంతో మున్సిపల్ నిధులతో అదనంగా 15 ఎంఎల్‌డీ నీటిని నిల్వ చేసే పంప్ హౌస్‌ను నిర్మించారు. ఈ పంప్ హౌస్‌కు నీటిని సరఫరా చేసి నూతన మోటార్ల ద్వారా కుళాయిలకు అందజేస్తున్నారు.

నీళ్ల కోసం రాత్రుళ్లు వేచి చూసేవాళ్లం



20 సంవత్సరాలుగా నంద్యాల పట్టణం దేవనగర్‌లో నివాసం ఉంటున్నాం. గతంలో నీళ్లు ఎప్పుడు వస్తాయో కూడా తెలిసేది కాదు. నీళ్ల కోసం నిద్రలేని రాత్రుళ్లు గడిపాం. రాత్రంతా మేలుకున్నా నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ట్యాంకర్లతో తీసుకువచ్చిన నీళ్లు కాలనీ వాసులందరికీ సరిపోయేవి కావు. ప్రస్తుతం పగటి పూటే నీటిని సమృద్ధిగా విడుదల చేస్తున్నారు. –సువర్ణమ్మ, దేవనగర్, నంద్యాల

పగలే నీళ్లు వదులుతున్నారు



వీసీ కాలనీలో 30 సంవత్సరాల నుంచి నీటి సమస్య కొనసాగింది. కొన్నిసార్లు మూడు రోజులు గడిచినా నీళ్లు వచ్చేవి కాదు. అధికారులను అడిగితే ఏవో సాకులు చెప్పేవారు తప్పించుకునేవారు. ప్రస్తుతం గతానికి భిన్నంగా పగటి పూటే నీళ్లు సరఫరా చేస్తున్నారు. దాదాపుగా నీటి సమస్యకు పరిష్కారం చూపారు. –షేక్ మల్లిక, వీసీ కాలనీ, నంద్యాల

పనులు 90 శాతం పూర్తి చేశాం



అమృత్ పథకం పనులు పూర్తి అయితే నంద్యాల నియోజకవర్గానికి నీటి సమస్య ఉండదు. ఈ పనులు 90 శాతం పూర్తి చేశాం. ఈ పనులు పూర్తయ్యేంత వరకు పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.65 లక్షలతో డెడికేటెడ్ ఫీడర్‌లైన్, రూ.45 లక్షలతో పంప్‌హౌస్ నిర్మాణం పూర్తి చేశాం. గతంలో అర్ధరాత్రి వేళల్లో నీళ్లు విడిచేవారు. ప్రస్తుతం పగలే విడుదల చేయాలని నిర్ణయించాం. రాత్రి 9గంటల లోపు నీటి సరఫరా పూర్తి చేయాలని అధికారలకు సూచించాం.

– శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

వాహనదారులకు ఆటంకం కలిగించొద్దు



ముత్తలూరు మెట్ట వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న ఏఎస్‌ఐ

రుద్రవరం: రోడ్లపై రాక పోకలు సాగించే వాహనదారులకు ఆటంకం కలిగించొద్దని ఏఎస్‌ఐ బాలన్న రైతులకు సూచించారు. కొద్ది రోజులుగా మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు రబీలో సాగు చేసిన వరి,మొక్కజొన్న వంటి పంటల కోతలు ముమ్మరంగా సాగిస్తున్నారు. దిగుబడులను ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. అయితే రైతులు దిగుబడులను రోడ్డుకు ఓ వైపు ఆరబోసి, ధాన్యంపైకి వాహనాలు రాకుండా రాళ్లను అడ్డుగా పేర్చుతున్నారు. ధాన్యం విక్రయాలు పూర్తి చేసుకున్న అనంతరం ఆ రాళ్లను తొలగించకుండా రోడ్లపై అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కావున రైతులు రాళ్లు తొలగించడమే కాకుండా వాహనాల రాకపోకలకు అడ్డంకులు సృష్టించరాదని, తమ వల్ల ప్రమాదాలు చోటుచేసుకుండా నడుచుకోవాలని సూచించారు. ఆదివారం రుద్రవరం,నర్సాపురం,ఆలమూరు,ఆళ్లగడ్డ వైపు ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం విక్రయించుకునే వరకు ప్రమాదాలు జరక్కుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'మా నమ్మకం నువ్వే జగన్' విజయవంతంపై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా నిర్వహించిన పీపుల్స్ సర్వే విజయవంతం కావడంపై వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నంద్యాల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాం రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థి నాయకులు, ప్రజలతో కలిసి ఆదివారం ఆయన స్థానిక గిరినాథ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ పార్టీకి మిస్డ్ కాల్స్ ఇచ్చి జగనన్న పాలనను సమర్థించారని చెప్పారు. నాయకులు శ్రీను, సంపత్, షాకీర్, సలామ్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఓర్వకల్లు : వివిధ నేరాల్లో, అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుపడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున ఆదివారం తెలిపారు. 53 వాహనాలకు సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న వేలం పాటలో పాల్గొనదలచినవారు తగిన ధరావత్తు చెల్లించి, ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుదన్నారు. వేలం పాటలో దక్కించుకున్న వాహనానికి సంబంధించిన ధర మెత్తం చెల్లించి వాహనాలను స్వాదీనపరచుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటా సంక్షేమ ఫలాల పంట



పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దొర్నిపాడు సచివాలయం-2లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల లబ్ధిని వివరిస్తూ, పాలన తీరును తెలుసుకొని, సమస్యలుంటే చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యలకు అక్కడికక్కడే అధికారులతో పరిష్కారం చూయించారు. పథకాల అమలులో పారదర్శకత పాటించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేసి అవినీతికి ఆస్కారం లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచులు దేవమణి, శివరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, బత్తుల రాజు, కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఫీ, శాంతయ్య, చిన్నమద్దిలేటి, వైస్ ఎంపీపీ లక్ష్మిరెడ్డి, నడిపెన్న, తిరుపతయ్య, రాంప్రసాద్‌రెడ్డి, బత్తుల కృష్ణయ్య, పాదం శీను, కొండయ్య, శ్రీపతి ప్రసాద్, నాగేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓ కరీం, ఏఓ శ్రీకృష్ణ, టీడీ వెంకటరవి, లైన్‌మేన్ నాగన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.

ఏడు పథకాలతో రూ.3,51,952 లబ్ధిచేకూరింది



మా కుటుంబానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.1,80,452, పింఛన్ కానుక ద్వారా రూ.87,500, జగనన్న విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, అమ్మఒడి, ఆసరా, రైతు భరోసా పథకాల ద్వారా రూ.3,51,952 నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. – సుబ్బరాయుడు, దొర్నిపాడు

మా కుటుంబానికి ఆరు పథకాలు అందాయి



జగన్న ప్రవేశ పెట్టిన ఆరు పథకాలు మా కుటుంబానికి వర్తించాయి. దీంతో ఇప్పటి వరకు మాకు రూ.3,30,453 నగదు మా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. వైఎస్సార్ పింఛన్ కానుక, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, ఇంటి స్థలం వంటివి అందాయి. ఇంతలా ఎన్నడూ అందలేదు.

– నాగమ్మ, దొర్నిపాడు

సెలవుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు

నంద్యాల(సిటీ): మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు సెలవులు ఉంటాయని, సెలవు రోజుల్లో పాఠశాలలను నడిపితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ బ్రహ్మంనాయక్ తెలిపారు. 2022-23 ఏప్రిల్‌కు మండల పరిధిలోని శ్రీలక్ష్మీ ఇంగ్లీషు మీడియం పాఠశాల, సంజీవనగర్, నంద్యాల. యూనివర్సల్ ప్రాథమికోన్నత పాఠశాల, చాంద్‌బాడ, నంద్యాల. పాఠశాలలు గుర్తింపు కోల్పోయాయన్నారు. ఆ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నాడు–నేడు రెండో దశకు ఎంపికై న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేసవి సెలవుల్లో నిర్దేశించిన 5 పనులను పూర్తి చేయాలని సూచించారు.

ఆధ్యాత్మికం

వేడుకగా పద్మావతి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కళ్యాణ మండపంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కొట్టె కృష్ణమూర్తి, చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, నరసింహారావు, నాగలీల, సరిత, శ్యాంసుందర్‌గుప్తా పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని అలవరచుకోవాలి



మాట్లాడుతున్న స్వామిజయదేవ్ నంద

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థి దశ నుంచే భారతీయ సనాతన ధర్మాన్ని అలవరచుకోవాలని శ్రీ రామకృష్ణానందగిరి శిష్యులైన ప్రేమానందస్వామి, జయదేవానందగిరి స్వాములు పేర్కొన్నారు. ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా బాలవికాస్ కేంద్ర పాఠశాల వార్షికోత్సవ వేడకలు స్థానిక జంబులాపరమేశ్వరి దేవస్థానం కళ్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బత్తలూరు, బెలుంశింగవరం, చెర్వుపల్లె, భూపనపాడు, ఎల్లావత్తుల, పెట్నికోట, నందిపాడు, బ్రమరాంభికా గూడెం తదితర గ్రామాలకు చెందిన బాల వికాస్ కేంద్రాల విద్యార్థులు,తల్లిదండ్రులు, నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, వాసు, సత్యంరెడ్డి, రవీంద్రకుమార్, ఇందిరాదేవి పాల్గొన్నారు.

వేడుకగా నిమిషాంబాదేవి జయంతి



ప్రత్యేక అలంకరణలో నిమిషాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చిన్న చెరువకట్ట వద్ద వెలసిన శ్రీనిమిషాంబాదేవి ఆలయంలో ఆదివారం పట్టణ చిత్తారి సంఘం ఆధ్వర్యంలో నిమిషాంబాదేవి జయంతిని వేడుకగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి పట్టవస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

యువత శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలి



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరసం సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నేటితరం యువత శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్ ముర్తుజా కోరారు. ఆదివారం శ్రీశ్రీ జయంతి సందర్భంగా సాయిబాబనగర్‌లోని భగత్‌సింగ్ గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనల ప్రాధాన్యతలను, కవితలను వివరించారు. విదేశాల్లో ఆయన కవితలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. న్యాయవాది శంకరయ్య మాట్లాడుతూ నేటి యువత కేవలం అంతర్జాలానికి మాత్రమే పరిమితమయ్యారని, పుస్తక పఠనాన్ని అలవరుచుకుంటే మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కవులు రఫీ, నీలకంఠం ఆచారి శ్రీశ్రీ రచించిన కవితలను వినిపించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ కళామురళి, శ్రీనివాసరావు, బాలరాజు, నారాయణ పాల్గొన్నారు.


వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



నెమలి ఈకల అలంకరణలో కన్యకాపరమేశ్వరి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్‌బజార్ అమ్మవారిశాలలో ఆదివారం కన్యకాపరమేశ్వరీ దేవీ జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ నిర్వహించి వాసవీ కన్యలతో చెరువుకట్ట నుంచి గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. శ్రీ నగరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం ఆర్యవైశ్య పతాకాన్ని అధ్యక్షుడు భవనాసి వాసు ఎగురవేశారు. నెమలి ఈకలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించి అమ్మవారికి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా కోలాటం, దీపోత్సవాలను ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబకు మహానైవేద్యం సమర్పించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లోని శ్రీగాయత్రీ విశ్వకర్మ దేవస్థానంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 330వ ఆరాధన మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఉత్సవమూర్తులు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేపట్టి మహానైవేద్యం సమర్పించి, మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వహకులు డాక్టర్ విశ్వరూపాచారి, విజయలక్ష్మి, శివ, సుబ్రహ్మణ్యం ఆచారి, సూర్యప్రకాష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, శ్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, విష్ణు అష్టోత్తర శతనామావళి, మంత్రపుష్పం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహిచారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి కోట తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు పేట తిరునాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మిడుతూరు: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏబీఎం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి గల జట్లు ఎంట్రీఫీజు రూ. 800 చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 63043 50817, 99637 12068, 91545 46544 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భానుడు అస్తమించే.. అగ్ని జ్వాలలు ఎగిసిపడే



దొర్నిపాడు వద్ద పంట వ్యర్థాలను తగులబెట్టగా ఎగిసి పడుతున్న మంటలు

దొర్నిపాడు: ప్రస్తుతం పొలాల్లో వేసవి సేద్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఖరీఫ్,రబీ పంటల అవశేషాలను తొలగిస్తున్నారు. పగలు ఎండ వేడిమి తీవ్రంగా ఉంటుండటంతో వ్యర్థాలను కాల్చివేసేందుకు జంకుతున్నారు. తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న పంటల అవశేషాలను కాల్చివేస్తున్నారు. ఈ క్రమంలో అగ్ని జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. సాయంత్రం సమయంలో సూర్యుడు నింగి నుంచి నిష్క్రమిస్తుండగా.. ఎగిసిపడే జ్వాలల దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.